AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
8-4-2026 (Wednesday) MAIN EDITION

## ఇరాన్ నుంచి నిష్క్రమించండి..




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్ – యూఎస్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కీలక అడ్వయిజరీ జారీ చేసింది. ఇరాన్‌లోని భారత పౌరులు రాయబార కార్యాలయంతో సమన్వయం చేసుకుని.. ఎంబసీ సూచించిన మార్గాల ద్వారా త్వరితగతిన ఇరాన్ నుంచి నిష్క్రమించాలని సూచించింది. అలాగే రాయబార కార్యాలయంతో సమన్వయం లేకుండా అంతర్జాతీయ భూ సరిహద్దులకు వెళ్లకూడదని పేర్కొంది. అలాగే ఎమర్జెన్సీ నంబర్లను ప్రకటించింది.

## కేంద్ర మాజీ మంత్రి మొహసినా కిద్వాయ్ కన్నుమూత




**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మొహసినా కిద్వాయ్ (94) కన్ను మూశారు. బుధవారం తెల్లవారుజామున నోయిడాలోని మెట్రో ఆసుపత్రిలో ఆమె తుది శ్వాస విడిచారు. మొహసినా కిద్వాయ్ కాంగ్రెస్‌లో సుదీర్ఘకాలం పని చేశారు. ఆమె వయసు సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆమె అల్లుడు రజీ ఉర్ రెహమాన్ కిద్వాయ్ తెలిపారు. నేడు సాయంత్రం నిజాముద్దీన్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారని చెప్పారు.

### విమానయాన సంస్థలకు కేంద్రం



అక్షరటుడే, ఢిల్లీ: ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఆర్థిక ఒత్తిడి ఎదుర్కొంటున్న దేశీయ విమానయాన సంస్థలకు ఊరట కల్పించేలా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ విమానాల ల్యాండింగ్, పార్కింగ్ రుసుము 25 శాతం తగ్గించాలని ఎయిర్‌పోర్ట్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ విమానాశ్రయాలను ఆదేశించింది.

### రైతు సంక్షేమమే ధ్యేయం: మంత్రి కోమటిరెడ్డి



అక్షరటుడే, నల్గొండ: రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. అన్నదాతల ముఖాల్లో చిరునవ్వు చూడటమే అసలైన విజయం అని పేర్కొన్నారు. నల్లగొండ మండలం జి.చెన్నారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు.

### కాల్పుల విరమణను స్వాగతించిన భారత్



అక్షరటుడే, నేషనల్ డెస్క్: యూఎస్ – ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది. మధ్యప్రాచ్యంలో శాశ్వత శాంతి నెలకొంటుందని ఆశిస్తున్నామని విదేశాంగ శాఖ ట్వీట్ చేసింది. యుద్ధం వల్ల ఇంధన సరఫరాలో అంతరాయం కలిగిందని, హార్ముజ్ గుండా స్వేచ్ఛగా నౌకలు ప్రయాణిస్తాయని ఆశిస్తున్నామని పేర్కొంది.

# అమెరికా, ఇరాన్ మధ్య సీజ్ ఫైర్



- రెండు వారాల కాల్పుల విరమణ
- అంగీకరించిన ఇరు దేశాలు
- తెరుచుకోనున్న హర్ముజ్
- దిగివచ్చిన చమురు ధరలు

**పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గనున్నాయి. నెల రోజులకు పైగా సాగుతున్న యుద్ధానికి తాత్కాలిక విరామం లభించింది. రెండు వారాల సీజ్ ఫైర్‌కు ఇరాన్, అమెరికా అంగీకరించాయి. దీంతో ఇన్ని రోజులు బాంబుల మోతతో దద్దరిల్లిన ఇరాన్, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లో పరిస్థితి సద్దుమణగనుంది. హర్ముజ్‌ను తెరవకపోతే మంగళవారం రాత్రి ఇరాన్‌ను అంతం చేస్తామని ప్రకటించిన డోనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గారు. రెండు వారాల పాటు కాల్పుల విరమణకు ఓకే చెప్పారు. ఇరాన్ సైతం సీజ్‌ఫైర్‌కు ఓకే చెప్పడంతో ముడి చమురు ధరలు దిగి వచ్చాయి.**

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఇరాన్‌పై సైనిక దాడులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్ తో జరిగిన చర్చల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పుకొచ్చారు. ఇరాన్ వెంటనే హార్ముజ్ జలసంధిని తెరవడానికి అంగీకరిస్తే.. రెండు వారాల పాటు బాంబుదాడులు, సైనిక చర్యలను నిలిపివేయడానికి అమెరికా సిద్ధంగా ఉందన్నారు. పరస్పర అంగీకారంతో అమలయ్యే ద్వైపాక్షిక కాల్పుల విరమణగా ఈ నిర్ణయాన్ని వర్ణించారు.

### శాంతి ఒప్పందం దిశగా చర్చలు

అమెరికా తన సైనిక లక్ష్యాలను ఇప్పటికే సాధించిందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌తో దీర్ఘకాలిక శాంతి ఒప్పందం దిశగా చర్చలు ముందుకు సాగుతున్నాయన్నారు. ఇరాన్ 10 అంశాల ప్రతిపాదన చర్చలకు పునాది అని అన్నారు. గతంలోని వివాదాస్పద అంశాల్లో చాలా వరకు రెండు దేశాలు కూడా ఏకాభిప్రాయానికి వచ్చాయని వివరించారు. రెండు వారాల విరామంలో తుది ఒప్పందాన్ని ఖరారు చేస్తామన్నారు. మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పడమే అమెరికా లక్ష్యంగా పెట్టుకున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు. ఈ నెల 10న ఇరుదేశాల మధ్య చర్చలు జరగనున్నాయి.

### ప్రపంచ శాంతికి గొప్ప రోజు

అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణపై సోషల్ మీడియా వేదికగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందించారు. ప్రపంచ శాంతికి ఇదొక గొప్ప రోజు అంటూ పోస్ట్ చేశారు. పశ్చిమాసియాలో ఇది సువర్ణాధ్యాయం కాబోతుందంటూ ఆయన వ్యాఖ్యానించారు. హర్ముజ్ జలసంధిలో రద్దీని నియంత్రించడంలో, కాల్పుల విరమణ కాలంలో స్థిరత్వాన్ని నిర్ధారించడంలో యునైటెడ్ స్టేట్స్ సహాయ పడుతుందని తెలిపారు. చాలా సానుకూల చర్యలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు.

### లెబనాన్‌పై దాడులు

కాల్పుల విరమణ ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పందించారు. ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని పేర్కొన్నారు. ఈ మేరకు లెబనాన్‌పై దాడులు చేసింది. దక్షిణ లెబనాన్‌లోని ఓ నగరం లక్ష్యంగా ఐడీఎఫ్ దళాలు దాడులు చేశాయి. తమ మిత్రదేశాలపై కూడా ఎలాంటి దాడులు చేయకూడదని ఇరాన్ ప్రతిపాదించిన తన 10 పాయింట్‌లలో పేర్కొంది. అయినప్పటికీ ఇజ్రాయెల్ దాడులను కొనసాగించడం గమనార్హం.

### ఇరాన్ ప్రతిపాదనలు

- ఎట్టి పరిస్థితుల్లోనూ పరస్పర దాడులకు దిగకూడదు
- హర్ముజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణ కొనసాగింపు
- యురేనియం సుసంపన్నతకు అంగీకారం
- అన్ని రకాల ప్రాథమిక, ద్వితీయ ఆంక్షల రద్దు

ఇరాన్‌కు పరిహారం చెల్లింపు

- ఈ రీజియన్ నుండి అమెరికా సాయుధ బలగాల ఉపసంహరణ
- లెబనాన్‌లోని హిజ్‌బుల్లాతో కాల్పుల విరమణ
- అమెరికా, ఇజ్రాయెల్ మిత్ర దేశాల బేస్ క్యాంపుల తొలగింపు

## ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాళేశ్వరం, దేవాదుల మోటార్లను పదే పదే ఆన్, ఆఫ్ చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. భారీ నీటి పారుదల మోటార్లను ఇష్టానుసారం స్టార్ట్, స్టాప్ చేయడం ఇంజినీరింగ్ నిబంధనలకు విరుద్ధమని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇలా చేస్తే వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంప్లర్స్, మోటార్లు పాడైపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటార్లను పాడు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యమా? లేక కావాలనే చేస్తున్న కుట్రనా అన్నారు. భారీ మోటార్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినవని, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదన్నారు.

## భారీగా పడిపోయిన చమురు ధరలు




**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధంలో రెండు వారాల పాటు కాల్పులు విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి. సీజ్ ఫైర్ కాలంలో హార్మ్యూజ్‌ను తెరిచేందుకు ఇరాన్ కూడా ఒప్పుకుంది. ఇరాన్ సాయుధ దళాల సమన్వయంతో సురక్షితంగా నౌకలు ప్రయాణించేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ తెలిపారు. ఈ నిర్ణయంతో ముడి చమురు ధరలు 15 శాతానికిపైగా పతనమయ్యాయి. బుధవారం ఉదయం బ్యారెల్ ధర 95 డాలర్ల దిగువ ట్రేడ్ అవుతోంది.

## వడ్డీ రేట్లు యథాతథం

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ మీటింగ్ ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించారు. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దీంతో రెపో రేటు 5.25 వద్ద కొనసాగనుంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా క్రూడ్ ఆయిల్ ధర భారీగా పెరగడం, రూపాయి విలువ గణనీయంగా క్షీణించడం, ద్రవ్యోల్బణం పెరుగుతుండడంతో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది.

## గ్లామర్ డోస్ పెంచిన ఢిల్లీ భామ..



**టాలీవుడ్ 'ఊహలు గుసగుసలాడే' భామ రాశీ ఖన్నా తన అందచందాలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. సినిమాల్లో హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా తన గ్లామర్‌తో కుర్రకారును కట్టిపడేస్తోంది. తాజాగా గ్రీన్ కలర్ మోడరన్ డ్రెస్సులో బ్యాక్ ఓపెన్ ఫోజులతో ఇంటర్నెట్‌కు సెగలు పుట్టించింది. అందం, అభినయం ఉన్నా అదృష్టం వరించని ఈ ఢిల్లీ బ్యూటీ, ప్రస్తుతం తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో నెట్టింట వైరల్ అవుతోంది. రాశీ ఖన్నా స్టన్నింగ్ లుక్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.**

–అక్షరటుడే, సినిమాడెస్క్

## బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరు బీటెక్ విద్యార్థుల మృతి





**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌ను అతివేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు బీటెక్ విద్యార్థులతో పాటు మరో వ్యక్తి చనిపోయాడు. నగరంలోని సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద బుధవారం ఉదయం యాక్సిడెంట్ జరిగింది. ఓ వ్యక్తి మద్యం మత్తులో కారును అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ వచ్చి ద్విచక్ర వాహనాన్ని, నడుచుకుంటూ వెళ్తున్న మరో వ్యక్తిని ఢీకొట్టాడు. బైక్‌ను వందమీటర్లకు వరకు కారు ఈడ్చుకు వెళ్లింది. అనంతరం బోల్తా పడింది. ఈ ఘటనలో మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై వెళ్తున్న మరో యువకుడు కూడా చనిపోయాడు.

## పైలెట్ ట్రైనింగ్ సెంటర్‌లో దారుణం..

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలోని బేగంపేటలో దారుణం చోటు చేసుకుంది. పైలెట్ శిక్షణ కోసం వచ్చిన యువతిపై ఓ వ్యక్తి అత్యాచారం చేశాడు. శిక్షణ పేరుతో జనవరి 2025 నుంచి పలుమార్లు అత్యాచారం చేశాడు. బేగంపేటలోని ఏవికన్స్ పైలెట్ శిక్షణ సంస్థలో ఓ యువతి పైలెట్ కోర్సు నేర్చుకోవడానికి జాయిన్ అయింది. సంస్థలో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న కేరళకు చెందిన నసిముద్దీన్ ఆమెపై కన్నేశాడు. శిక్షణ పేరుతో యువతిని లోబర్చుకొని 2025 జనవరి నుంచి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతేగాకుండా ఆ దారుణాలను ఫొటోలు, వీడియోలు తీశారు. వాటిని చూపించి బాధితురాలని బెదిరించాడు. అతడికి దమ్మాయిగూడకు చెందిన మరో ఇన్‌స్ట్రక్టర్ సల్మాన్ సహకరించడం గమనార్హం.

## కాళేశ్వరం కమిషన్ నివేదికపై తీర్పు వాయిదా



**అక్షరటుడే, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై తీర్పు వాయిదా పడింది. ఈ నెల 22వ తేదీన తుది తీర్పు వెల్లడిస్తామని హైకోర్టు తెలిపింది. బీఆర్ఎస్ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌లో భారీగా అక్రమాలు జరిగాయని నాటి నుంచి కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ క్రమంలో 2023లో బీఆర్ఎస్ అధికారంలో ఉండగానే.. ప్రాజెక్ట్‌లో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యతపై అనేక అనుమానాలు తలెత్తాయి. తాము అధికారంలోకి వస్తే కాళేశ్వరంపై విచారణ జరిపిస్తామని నాడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాళేశ్వరం కమిషన్ నివేదిక అనంతరం ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించింది. మరోవైపు ఈ నివేదిక చెల్లదని కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇరు పక్షాల వాదనలను కోర్టు గతంలోనే విని తీర్పు రిజర్వు చేసింది. బుధవారం తీర్పు చెప్పాల్సి ఉండగా.. ఈ నెల 22కు వాయిదా వేస్తున్నట్లు తాజాగా తెలిపింది. ఘోష్ కమిషన్ రిపోర్ట్ చెల్లుతుందా?.. లేదా, కాళేశ్వరం నివేదికపై హైకోర్టు స్టే ఇస్తుందా అనేది త్వరలో తేలనుంది.